క్లుప్తంగా

వైభవంగా కలశ స్థాపన పూజలు

సిద్దవటం : మండలం లోని కనుమలోపల్లె గ్రామంలో వెలసిన ఉమాదేవి సహిత నీలకంఠేశ్వరస్వామి, అష్టోత్తర (108) మహా లింగేశ్వర స్వామి దేవస్థానం ట్రస్టు ఆధ్వర్యంలో జీర్ణోద్ధరణ పూర్వాక పునఃఆలయంలో విగ్రహ ప్రతిష్టలో భాగంగా బుధవారం కలశ స్థాపన పూజలు వేదపండితులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో వేదపారాయణము, అనుజ్ఞగోపూజ, భూతబలి, యాగశాల ప్రవేశం, విఘ్నేశ్వర పూజ, పుణ్యహవాచనము, పంచగవ్య ఆరాధన, దీక్షాధారణ, రిత్విక్‌రుణం, రక్షబంధనం, మూర్తి హోమం, బ్రహ్మ, విష్ణు కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, సోమాబాబు, కమిటీ సభ్యుడు మల్లేశ్వర్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

రాముడి విశిష్ట గుణాలే రామాయణం విశిష్టత

నందలూరు : రాముడి విశిష్ట గుణాలే రామాయణం విశిష్టత అని తెలుగు ఉపాధ్యాయులు గంగనపల్లి వెంకటరమణ అన్నారు. సీపీ బ్రౌన్ భాషా పరిశోధక గ్రంథాలయం యోగి వేమన విశ్వవిద్యాలయం కడప, ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యాయన కేంద్రం నెల్లూరు వారు సంయుక్తంగా నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో గంగనపల్లి వెంకటరమణ సత్కారం అందుకున్నారు. తెలుగులో రామాయణాలు సామాజిక దృక్పథం అనే పేరుతో నిర్వహిస్తున్న ఈ అంతర్జాతీయ సదస్సులో అవకాశం దక్కడం గంగనపల్లి వెంకటరమణ హర్షం వ్యక్తం చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జయలలిత కుమారి ఉపాధ్యాయులు వెంకటరమణను అభినందించారు.

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి

పుల్లంపేట : మండల పరిధిలోని దళవాయిపల్లి ప్రాథమిక పాఠశాలలో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఛత్రపతి శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఉపాధ్యాయుడు రమణ మాట్లాడుతూ భరతమాత ముద్దు బిడ్డ ఛత్రపతి శివాజీ అని కొనియాడారు. అనంతరం ఆయన పోరాటపటిమను గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాలపై అవగాహన

ఒంటిమిట్ట : విద్యుత్ ప్రమాదాలపై కడప జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఎస్. రమణ ప్రజలకు అవగాహన కల్పించారు. ఒంటిమిట్ట మండలం సాలాబాదు గ్రామంలో బుధవారం జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ రమణ షార్ట్ ఫిల్మ్ ద్వారా అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యుత్ పరికరాలను తడిచేతితో ముట్టుకోరాదన్నారు. విద్యుత్ సమస్యలు ఏర్పడితే తమ సిబ్బందిని సంప్రదించాలని ప్రజలకు, రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మధుసూదన్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సుబ్రహ్మణ్యం, అసిస్టెంట్ ఇంజినీర్ ఉదయ్ కుమార్, విద్యుత్ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఎన్సీడీ సర్వేను పూర్తి చేయాలి

సిద్దవటం : ఎన్సీడీ సర్వేను మార్చి నెల చివరిలోపు పూర్తి చేయాలని జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ రవిబాబు వైద్య సిబ్బందికి ఆదేశించారు. సిద్దవటం మండలంలోని మాధవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో జరుగుతున్న ఎన్సీడీ సర్వేను (నాన్ కమ్యూనికెబుల్ డిసీజ్)ని బుధవారం జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ రవిబాబు పెద్దపల్లి, మహబూబ్‌నగర్ ఆరోగ్య ఉపకేంద్రాల పరిధిలో వైద్య సిబ్బంది నిర్వహిస్తున్న సర్వేని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాల వయస్సు పైబడిన వారికి బీపీ, షుగర్ నిర్ధారణ పరీక్షలతో పాటు క్యాన్సర్ నిర్ధారిత పరీక్షలు చేసి అనుమానిత కేసులను రిమ్స్ స్పెషలిస్టు విభాగానికి రెఫర్ చేయాలని సిబ్బందికి సూచించారు. మాధవరం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శివకుమార్, సూపర్‌వైజర్ జ్యోతి పాల్గొన్నారు.

ఆర్ఎంపీ డాక్టర్ ఇంట్లో చోరీ

సిద్దవటం: మండలంలోని బుధవారం భారీ చోరీ జరిగింది. కడప–చెన్నై జాతీయ రహదారిలోని నిర్మలగిరి కాలనీకి చెందిన ఆర్ఎంపీ డాక్టర్ వీరభద్రయ్య ఇంట్లో దాదాపు 35 తులాలు బంగారు. రూ.2లక్షలు నగదు చోరీకి గురైనట్లు బాధితుడు పేర్కొన్నాడు. మధ్యాహ్నం ఎవరూ లేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు దోచుకెళ్లినట్లు చెబుతున్నారు. విషయం తెలుసుకున్న కడప క్రైం బ్రాంచి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించి దర్యాప్తు చేపట్టారు.

పాఠశాలను పరిశీలించిన డీఈఓ

వీరబల్లి : మండల కేంద్రంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను, కస్తూర్బా బాలికల గురుకుల పాఠశాలలను అన్నమయ్య జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రహ్మణ్యం బుధవారం పరిశీలించారు. అదే విధంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతున్న విద్యార్థులు యొక్క శక్తి సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులకు జరగబోవు పదోతరగతి పరీక్షల్లో ఎలా రాయాలనే అంశంపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. విద్యార్థులకు చదువుతోపాటు క్రమశిక్షణ కూడా నేర్పాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనాన్ని అందించాలని లేకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

చక్కటి రాత.. మార్కుల మోత

పదో తరగతి వార్షిక పరీక్షలు మార్చి 17 నుంచి ప్రారంభం కానున్నాయి. ప్రస్తుతం ప్రీ ఫైనల్ పరీక్షలకు విద్యార్థులు సన్నద్ధమవుతున్నారు. పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు విద్యార్థులు రాత్రింబవుళ్లు పుస్తకాలతో కుస్తీ పడుతున్నా రు. ఎంత చదివామన్నది ఎంత ముఖ్యమో ఎలా రాశామన్నది కూడా అంతే ముఖ్యం. అయితే పరీక్షల్లో మంచి మార్కులు సాధించడానికి మన చేతిరాత ఎలా ఉండనేది కూడా ఆలోచించుకోవాలి.

- పదాలు, పేరాల మధ్య తగినంత నిడివి పాటించాలి
- అందమైన రాతతో అధిక మార్కులు


చిన్నమండెం మోడల్ స్కూల్‌లో దస్తూరి ప్రాక్టీస్ చేస్తున్న విద్యార్థులు

చిన్నమండెం : రాళ్లపైన అక్షరాలు చెక్కిన రాతి యుగం నుంచి పేపర్‌పై పెన్నుతో అక్షరాలు రాసే నేటి కంప్యూటర్ యుగం దాకా చేతిరాత ఎన్నో మలుపులు తిరుగుతూ వస్తోంది. ప్రపంచంలో ఏ ఇద్దరి చేతిరాత ఒకేతీరుగా ఉండదు. రాయడంలో ఎవరి శైలి వారిది. అక్షరాలను ముత్యాల్లా రేసేవారు కొందరైతే మరికొందరు కొంగలు తొక్కిన రీతిలో గజిబిజిగా రాస్తారు. నా రాత నా ఇష్టం అనుకోకుండా చక్కటి రాతతో మంచి మార్కులు సాధించాలి. అందమైన రాత ఉంటే మంచి భవిష్యత్తును పొందుతారు. రాతను బట్టి వ్యక్తి గుణగణాలను అంచనా వేయవచ్చని గ్రాఫాలజిస్టుల అభిప్రాయం. చిన్న వయస్సు నుంచే అక్షరాలను గుండ్రంగా రాయడం ప్రాక్టీస్ చేయాలి. బ్రహ్మ రాసిన నుదుటి రాతను చేతి రాత ద్వారా కొంతవరకైన మార్చుకోవచ్చు. పరీక్షల్లో అందమైన చేతిరాతతో జవాబులు రాస్తే 10 నుంచి 15 శాతం మార్కులు అదనంగా స్కోర్ చేయవచ్చు. ఆణిముత్యాల్లాంటి అక్షరాల కోసం కొన్ని ప్రాథమిక సూత్రాలు పాటించాలని ఉపాధ్యాయులు చెబుతున్నారు. విద్యార్థులకు అక్షరాలు అందంగా రాయడానికి శిక్షణ ఇస్తున్నారు.

ఈ జాగ్రత్తలు మేలు

- సమాధానపత్రంలో రాసే జవాబు సూటిగా ఉండటంతో పాటు అక్షరాలు పొందికగా ఉంటే పేపరు దిద్దేవారు ఒకటికి రెండు మార్కులు అదనంగా వేసే అవకాశం ఉంటుంది.
- పేజీ పైభాగంలోను, ఎడమవైపు ఒక అంగుళం మార్జిన్ విడిచిపెట్టాలి.
- సామాన్య, భౌతిక శాస్త్రాల్లో బొమ్మలు గీసి, భాగాలు గుర్తించే విషయంలో పెన్ను ఒత్తి పెట్టి రాయకూడదు. ఇలా చేస్తే పేపర్ వెనుక అసహ్యంగా కనిపిస్తుంది.
- పేజీలో వాక్యాలుపై నుంచి కిందకు లేదా పైకి ఉండకుండా వరుస క్రమంలో ఉండాలి.
- పేజీకి 16 నుంచి 20 లైన్లు మించి రాయకూడదు.
- రోజు కొద్దిసేపు సాధన చేస్తే పరీక్షల్లో ఆందోళన లేకుండా సాఫీగా రాయవచ్చు.
- పెన్ను సక్రమంగా పట్టుకొని రాస్తే.. రాసే అక్షరాలు అందంగా గుండ్రంగా ఉంటాయి.
- జవాబులు రాసేటపుడు ప్యాడ్ పైకి వాలిపోకుండా సాధ్యమైనంత వరకు నిటారుగా కూర్చుని రాయడం మంచిది.
- అక్షరాలు, పదాలు, వాక్యాల మధ్య తగినంత ఖాళీ ఉండాలి.

చేతిరాతకు ప్రాధాన్యం ఇవ్వాల్సిందే



శాస్త్ర, సాంకేతిక రంగం ఎంత ఎదిగినా చేతిరాతకు ప్రాధాన్యం పెరుగుతూనే ఉంది. సంబంధిత భాషపై పట్టు ఉంటే రాయడం తేలిక అవుతుంది. దస్తూరి బాగున్న విద్యార్థులు అదనంగా మార్కులు పొందే అవకాశం ఉంటుంది. మా పాఠశాలలోని విద్యార్థులకు ఈ తరహా తర్ఫీదు ఇస్తున్నాం.

– వి.రమేష్, ప్రిన్సిపాల్, మోడల్ స్కూల్, చిన్నమండెం

అదనపు మార్కులు సొంతం



అదనపు మార్కులకు చేతిరాత చాలా ముఖ్యం. చేతిరాతను బట్టి విద్యార్థి సామర్థ్యాన్ని అంచనా వేయవచ్చు. పాఠశాల సముదాయ సమావేశాల్లో ఇదే విషయాన్ని అధికారులు స్పష్టం చేస్తున్నారు. విద్యార్థి రాసే సమాధానం ద్వారా అతని వ్యక్తిత్వాన్ని అంచనా వేయవచ్చు. దస్తూరి బాగుంటే మంచి మార్కులు వస్తాయి. మానసిక ఒత్తిడితో రాయకూడదు. చేతిరాత బాగుంటే మంచి ఫలితాలు సాధించవచ్చు.

– అరుణకుమారి, ఎస్‌ఓ, కస్తూర్బాగాంధీ గురుకుల పాఠశాల, చిన్నమండెం

బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించుకుందాం

రాయచోటి టౌన్ : రాయచోటి శ్రీభద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి వారి బ్రహ్మోత్సవాలు ఈ నెల 23వ తేదీ నుంచి మార్చి 5 వరకు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సహకరించాలని రాయచోటి తహసీల్దార్ నరసింహకుమార్ కోరారు. అలాగే బ్రహ్మోత్సవాల నిర్వహణపై విస్తృత ప్రచారం చేసి భక్తులు విశేషంగా వచ్చేవిధంగా ప్రచార మాధ్యమాలు బాధ్యత వహించాలని కూడా కోరారు. బుధవారం శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో ఆలయ ఈఓ డీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో అన్ని శాఖ అధికారులతో కలసి సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానంగా భక్తులకు తాగునీరు, పారిశుధ్యం సమస్య రాకుండా చూడాల్సిన బాధ్యత మున్సిపల్ అధికారులు చేపట్టాలన్నారు. ఇక బ్రహ్మోత్సవాల నిర్వహించే సందర్భంలో పారిశుద్ధ్య సమస్య ఎక్కువగా ఉంటుంది కాబట్టి దీనిపై ప్రత్యేత శ్రద్ధ చూపాలని సూచించారు. బ్రహ్మోత్సవాల నిర్వహణలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పోలీస్ అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రతి రోజు మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని ఆరోగ్యశాఖ అధికారులకు సూచించారు. అనంతరం సమన్వయ కమిటీతో ఉత్సవాల నిర్వహణపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ విశ్వనాథరెడ్డి, ఎస్ఐ నరసింహారెడ్డి, డిప్యూటీ ఈఓ శివప్రకాష్‌రెడ్డి, మున్సిపల్ అధికారి మల్లికార్జున, ఫైర్ స్టేషన్ అధికారి వెంకట్రామిరెడ్డి, పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రాయచోటి తహసీల్దార్ నరసింహకుమార్

అంగన్‌వాడీ వర్కర్లకు శిక్షణ

సిద్దవటం : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం జానజ్యోతిపై అంగన్‌వాడీ వర్కర్లకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించామని ఎంఈఓ పద్మజ, ఎంఈఓ–2 అరుణ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ శిక్షణా కార్యక్రమంలో పిల్లల సమగ్రాభివృద్ధిపై ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు వేణుగోపాల్‌రెడ్డి, ఖాదర్‌వల్లి వివరించారన్నారు. అంగన్‌వాడీ వర్కర్ల నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ప్రాథమిక విద్య నాణ్యతను పెంపొందించడంతో పాటుగా పిల్లల సమగ్రాభివృద్ధి పెంపొందించేందుకు తోడ్పాటు అందించడం జరుగుతుందన్నారు. గర్భిణులు, బాలింతలు, పిల్లల ఎదుగుదల కోసం పౌష్టికాహారం అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్లు, సూపర్‌వైజర్లు, పాల్గొన్నారు.

కదిలిన యంత్రాంగం


యర్రప్పగారిపల్లి రోడ్డును చదును చేయించిన అధికారులు

లక్కిరెడ్డిపల్లి : మండలంలోని కోనంపేట పంచాయతీ, ఎర్రప్పగారిపల్లికి వెళ్లే రోడ్డు మార్గాన్ని కొనసానివాండ్లపల్లెకు చెందిన అధికార పార్టీ కూటమి నేతలు జేసీబీ సాయంతో మంగళవారం ధ్వంసం చేయడంతో సాక్షిలో రాసిన కథనంతో బుధవారం లక్కిరెడ్డిపల్లి పోలీసులు, రెవెన్యూ సిబ్బంది సహకారంతో ఎట్టకేలకు యర్రప్పగారిపల్లి రోడ్డును చదును చేయించారు. రెవెన్యూ సిబ్బంది సర్వేయర్లతో కొలతలు వేయించగా కూటమినేతల భూముల్లో రోడ్డు లేదని తేల్చినట్లు యర్రప్పగారిపల్లి గ్రామస్తులు తెలిపారు. దీంతో ఏఎస్ఐ మస్తాన్, రెవెన్యూ సిబ్బంది, వీఆర్ఓలు, సర్వేయర్లు కూటమినేతలను పిలిపించి రోడ్డు జోలికి వెళ్లవద్దని తెలిపినట్లు గ్రామస్తులు తెలిపారు. అధికారాన్ని అడ్డుపెట్టుకొని గ్రామీణ రోడ్లను తొలగించడం బాధాకరమని యర్రప్పగారిపల్లి గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. యర్రప్పగారిపల్లి పల్లెకు మినహాయింపు రోడ్డు మార్గం ఉందని తేల్చిన రెవెన్యూ అధికారులకు, పోలీసులకు, సాక్షి మీడియాకు గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

ఆప్కాస్ కార్మికులను పర్మినెంట్ చేయాలి


రాజంపేట రూరల్ : ఆప్కాస్ సంస్థ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షుడు చిత్వేలి రవికుమార్ డిమాండ్ చేశారు. స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో బుధవారం కార్మికులతో రవికుమార్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 6వ తేదీన నిర్వహించిన మంత్రి వర్గ సమావేశంలో ఆప్కాస్ సంస్థను రద్దు చేయాలని తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. మంత్రివర్గ సమావేశంలో ప్రైవేటు ఏజెన్సీలను ప్రవేశ పెడతామని నిర్ణయించడం వలన ఆప్కాస్ కార్మికులందరిలో తీవ్ర భయాందోళన నెలకొన్నదని తెలియజేశారు.

తాగునీటి సమస్య లేకుండా చూడాలి

రామాపురం : గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీపీ గడికోట విజయలక్ష్మి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ వేసవి కాలంలో నిరంతరం తాగునీటి సరఫరా అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని అన్నారు. జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై ఎంపీడీఓ జాషువా వివరించారు. పంచాయితీ రాజ్ ఇంజినీర్ జగదీష్ మాట్లాడుతూ మండలంలో సిమెంటు రోడ్డు మొదటి విడతలో పూర్తి చేశారని, రెండవ విడత పనులు మొదలు పెడుతున్నామని తెలిపారు. ఎంఈఓ రామకృష్ణుడు మాట్లాడుతూ నీలకంఠ్రావుపేట బాలికల సంక్షేమ వసతి గృహాల అభివృద్ధి కోసం రూ.12లక్షలు మంజూరు, ఈ పనులు త్వరలో టెండర్ ద్వారా పనులు చేపడతారన్నారు. వ్యవసాయ అధికారి నాగమణి మాట్లాడుతూ ఈనెల 27వ తేదీలోపు ప్రతి రైతు ఈకేవైసీ చేయించుకుని రైతు గుర్తింపు కార్డు పొందాలన్నారు. అనంతరం సభ్యులు మాట్లాడుతూ కందులకు మాత్రమే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. ఉలవ, వేరుశనగ పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, కోరారు. ఉద్యానవన శాఖ అధికారి నాగమణి మాట్లాడుతూ సస్యరక్షణపై గ్రామాల్లో ప్రజలకు రైతులకు అవగాహన కల్పించామన్నారు. రామాపురం మండలాన్ని కరువు మండలంగా ప్రభుత్వం ప్రకటించడంతో ఉపాధి హామీ పథకంలో కూలీలకు 150 పని దినాలు కల్పించిందని ఉపాధి ఈసీ శివయ్య తెలిపారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి, తహసీల్దార్ రామాంజనేయులు, ఎంపీడీఓ జాషువా, ఎంఈఓ రామకృష్ణుడు, ఏఓ నాగమణి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామ, మండల శాఖ అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీడీఓ జాషువా

సబ్సిడీ రుణాలకు ఇంటర్వ్యూ


ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు

సంబేపల్లె : సబ్సిడీ రుణాల కోసం మండల వ్యాప్తంగా దరఖాస్తులు చేసుకున్న లబ్ధిదారులకు బుధవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ రామచంద్ర ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా బ్యాంక్ మేనేజర్ల సమక్షంలో సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తులు చేసుకున్న లబ్ధిదారుల ధ్రువపత్రాలను పరిశీలించారు.

217 మంది హాజరు

గాలివీడు : బీసీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాలకు 217 మంది హాజరైనట్లు ఎంపీడీఓ జవహర్ బాబు తెలిపారు. బుధవారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బ్యాంకర్ల సమక్షంలో జరిగిన సబ్సిడీ రుణాలకు 513 మంది దరఖాస్తు చేసుకోగా 217 మంది హాజరయ్యారు.

వీరబల్లి : బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు గురువారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు నిర్వహించారు. 286 మంది రుణాలకు దరఖాస్తు చేసుకోగా.. 221 మంది ఇంటర్వ్యూలకు హాజరైనట్లు ఎంపీడీఓ నూర్జహాన్ తెలిపారు. హాజరైన అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథ్ రెడ్డి, సచివాలయ సిబ్బంది, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సిద్దవటం : మండలం లోని బీసీ కార్పొరేషన్ రుణాల కోసం బుధవారం ఎంపీడీఓ కార్యలయంలో నిర్వహించిన ఇంటర్వ్యూలకు 182 మంది దరఖాస్తు దారులు హాజరయ్యారని ఎంపీడీఓ ఫణి రాజకుమారి తెలిపారు. మండలానికి 41 యూనిట్లు మంజూరయ్యాయని తెలిపారు.

రాజంపేట టౌన్ : నిరుద్యోగులు తాము ఎంచుకున్న రంగంలో ఆర్థికాభివృద్ధి సాధించాలని ఎంపీడీఓ పి. వరప్రసాద్ తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బీసీ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ బ్యాంకు రుణాలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. వ్యాపారులకు నమ్మకమే పెద్ద పెట్టుబడి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ బ్యాంకులకు చెందిన మేనేజర్లు, ఫీల్డ్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులకు భయపడేది లేదు


మాట్లాడుతున్న రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి

ఒంటిమిట్ట : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి రెడ్‌బుక్ పాలన అంటూ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను అక్రమంగా అరెస్టు చేస్తున్నారని, అరెస్టులకు భయపడేది లేదని వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం మండల పరిధిలోని చెర్లోపల్లి గ్రామంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీని అరెస్టు చేయడం అక్రమమని తెలిపారు. అనంతరం చెర్లోపల్లిలో జరుగుతున్న చామబసి రెడ్డి కుమార్తె వివాహ వేడుకకు ఆయన హాజరై వధూవరులను ఆశీర్వదించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు సావిత్రి, హరిబాబు, చామ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

గుండె సమస్యల పట్ల అలసత్వం వద్దు

రాజంపేట టౌన్ : గుండె సమస్యల పట్ల ప్రజలు ఏమాత్రం అలసత్వం వహించకూడదని ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని మెయిన్ రోడ్డులో బుధవారం నూతనంగా ఏర్పాటు చేసిన భరత్ హార్ట్ అండ్ జనరల్ హాస్పిటల్‌ను మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. భరత్ హార్ట్ అండర్ జనరల్ హాస్పిటల్ ఎండీ ఎస్.భరత్‌తేజ్, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ ఎస్.ఈశ్వరయ్య, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు జెనుగు కృష్ణారావుయాదవ్, పాపినేని విశ్వనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

నివాళి

నందలూరు: నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీ, అరవపల్లిలోని ఎన్టీఆర్ నగర్‌లో రిటైర్డ్ రైల్వే ఉద్యోగి షరీఫ్ అలీ మృతి చెందారు. విషయం తెలుసుకున్న రాజంపేట శాసనసభ్యులు ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి షరీఫ్ అలీ మృతదేహానికి నివాళులు అర్పించారు. అలాగే రిటైర్డ్ హెల్త్ డిపార్టుమెంట్ గుండాలయ్య సతీమణి ఆదిలక్షమ్మ మృతి చెందడంతో ఆమె మృతదేహానికి అర్పించారు. వైస్ ఎంపీపీ అనుదీప్, మల్లికార్జున రెడ్డి, అరిగెల సామిత్రి, అరిగె హరిబాబు, ఉప సర్పంచ్ ఇబ్బు, ఆకేపాటి జగదీష్ రెడ్డి, గుండు గోపాల్‌రెడ్డి, ఆకేపాటి రమేష్ రెడ్డి, మహబూబ్ బాషా, బూసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, గంగయ్య, శ్రీను పాల్గొన్నారు.

రాజంపేట రూరల్ : మండల పరిధిలోని ఆకేపాడు పంచాయతీలోని పెద్దూరుకు చెందిన జానకి బుధవారం మృతి చెందారు. అయితే విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి పెద్దూరుకు వెళ్లి జానకి మృతదేహానికి నివాళి అర్పించారు.

సామాన్య భక్తులకు పెద్దపీట

- మార్చి 1, 2వ తేదీల్లో గంగమ్మ జాతర
- ఆర్డీఓ ఏ. శ్రీనివాసులు


మాట్లాడుతున్న ఆర్డీఓ ఏ. శ్రీనివాసులు

లక్కిరెడ్డిపల్లి : గంగమ్మ జాతరను మార్చి 1, 2వ తేదీల్లో నిర్వహిస్తున్న నేపథ్యంలో సామాన్య భక్తులకు పెద్దపీట వేయాలని అన్నమయ్య జిల్లా ఆర్డీఓ ఏ శ్రీనివాసులు అధికారులకు సూచించారు. బుధవారం మండలంలోని స్థానిక గంగమ్మ దేవత ఆలయ ప్రాంగణంలో మండలస్థాయి అధికారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్ని శాఖల అధికారులతో జాతర ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. తాగునీటి సమస్య తలెత్తకుండా అదనపు ట్యాంకర్లు ద్వారా నీటిని సరఫరా చేయాలన్నారు. జాతర జరిగే మూడు రోజులపాటు విద్యుత్‌కు అంతరాయం లేకుండా చూడాలన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ఎక్కడికి అక్కడ ఏర్పాట్లు ముందస్తుగా చేపట్టాలన్నారు. శానిటేషన్, మరుగుదొడ్లు, స్నానపు గదులు ఏర్పాటు చేసేలా అధికారులు చొరవచూపాలన్నారు. భారీకేడ్లు, చలువపందిళ్ల ఏర్పాటు చేయాలన్నారు. జాతర మూడు రోజులు ఆర్టీసీ వారు ప్రత్యేక బస్సులను నడపాలన్నారు. వైద్య సిబ్బంది ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి తహశీల్దార్ రామాంజనేయులు, ఆలయ ప్రత్యేక అధికారి శ్రీనివాసులు, ఏఈ హరినాథ్, కోనంపేట పీహెచ్‌సీ వైద్యులు సిద్దయ్య, దేవాదాయ ఇన్‌స్పెక్టర్ శివయ్ తదితరులు పాల్గొన్నారు.

ఐకమత్యంతో ముందుకు వెళ్లాలి

కుల మతాలకు అతీతంగా ఐకమత్యంతో అందరూ ముందుకు వెళ్లాలని ఆర్డీఓ శ్రీనివాసులు పేర్కొన్నారు. లక్కిరెడ్డిపల్లిలో గత రెండు రోజులుగా మసీదుకు సంబంధించి హిందూ, ముస్లింలకు జరుగుతున్న విషయంలో బుధవారం స్థానిక ఎంపీడీఓ సభా భవనంలో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హిందువులు, ముస్లింలు తమ తమ వాదనలు ఆర్డీఓకు వివరించారు. అనంతరం ఆర్డీఓ మాట్లాడుతూ దేవుడు అందరికీ ఒకరేనని, భారతదేశంలో హిందూ, ముస్లిం అనే తేడా లేకుండా అందరూ కలిసిమెలసి జీవించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రామాంజనేయులు, ఎస్ఐ రవీంద్రబాబు, హిందూ, ముస్లింలు పాల్గొన్నారు.

మున్సిపల్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

రాయచోటి అర్బన్ : మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నేలపాటి శ్రీనివాసులు, సురేష్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మున్సిపల్ కార్మికులతో కలసి కమిషనర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ ఉద్యోగులు, కార్మికులకు వేతనాల చెల్లింపు, పనుల అప్పగింత, నిర్వహణ మున్సిపల్ శాఖ నిర్వహించాలని కోరారు. కూటమి ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. కార్మికుల సమస్య పరిష్కారం కోసం మార్చి 6న చలో విజయవాడ నిర్వహించే కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నేత శ్రీనివాసులు, మద్దెల కేశవరావు, హరిప్రసాద్, వెంకటేష్, క్రిష్ణయ్య పాల్గొన్నారు.


కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నేతలు

రైతులకు విశిష్ట సంఖ్య తప్పనిసరి

సుండుపల్లి : మండలంలోని రైతులందరూ విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరిగా రైతు సేవా కేంద్రాలలో నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఎస్. మహబూబ్ బాషా పేర్కొన్నారు. మండల పరిధిలోని సుండుపల్లి–3, ముడుంపాడు రైతు సేవా కేంద్రాలలో జరుగుతున్న రైతు విశిష్ట సంఖ్య నమోదు ప్రక్రియను ఆయన పరిశీలించారు. పట్టాదారు పాసుపుస్తకం ఉన్న రైతులందరూ వారి పేరు మీద రైతు విశిష్ట సంఖ్యను నమోదు చేసుకోవాలని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు అందించే ఏ పథకం అయినా ఈ రైతు విశిష్ట సంఖ్య ద్వారానే అనుసంధానం చేయడం జరుగుతుందని, రైతు సేవా కేంద్రాలలో రైతులు తమ భూమిపాసు పుస్తకం, ఆధార్ కార్డు, సెల్ ఫోన్ నెంబరు తీసుకొని వెళ్లి ఆన్‌లైన్‌లో గుర్తింపు కార్డు నమోదు ప్రక్రియ పూర్తి చేసుకున్న వారికి త్వరలో గుర్తింపు కార్డులు కూడా జారీ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మహబూబ్ బాషా, ఆర్ఎస్‌కే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలి

రాయచోటి అర్బన్ : వెంటనే మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జక్కల వెంకటేష్, రాజశేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టరేట్‌లో డీఆర్ఓ మధుసూదన్‌కు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో సూపర్‌సిక్స్‌లో భాగంగా 20 లక్షల ఉద్యోగాలిస్తామని కూటమి నేతలు హామీయిచ్చారన్నారు. అదేవిధంగా ఖాళీగా ఉన్న 16,117 ఉపాధ్యాయ పోస్టులను భర్తీచేస్తామంటూ హామీయిచ్చి అధికారంలోకి వచ్చాక ఆ ఊసే ఎత్తడం లేదని విమర్శించారు. డీఎస్సీ నోటిఫికేషన్‌పై ప్రభుత్వం నేటికీ స్పష్టమైన ప్రకటన చేయలేక పోతుండడం దారుణమన్నారు. కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యుడు పెంచలయ్య పాల్గొన్నారు.

కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంపై చర్యలు తీసుకోండి

- మున్సిపల్ ఆదాయం పెంచేందుకు మార్గాలను అన్వేషించండి
- అధికారుల తీరుపై మండిపడ్డ మున్సిపల్ పాలక వర్గం



అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కౌన్సిల్‌సభ్యులు, మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ చిల్లీస్ ఫయాజ్‌బాషా

రాయచోటి అర్బన్ : పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనుల పూర్తిలో నిర్లక్ష్యం, అలసత్వం వహిస్తున్న కాంట్రాక్టర్ల తీరుపై పాలవకవర్గ సభ్యులం తాతీవ్రస్థాయిలో మండిపడ్డారు. బుధవారం మున్సిపల్ సభాభవనంలో చైర్మన్ చిల్లీస్ ఫయాజ్‌బాషా అధ్యక్షతన జరిగిన మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో 2025–26 సంవత్సరం సాధారణ బడ్జెట్‌తో పాటు పట్టణాభివృద్ధి, ప్రజా సమస్యలపై చర్చ జరిగింది. చైర్మన్ మాట్లాడుతూ మున్సిపాలిటీ ఆదాయం పెంపునకు మార్గాలను అన్వేషించాలంటూ అధికారులను కోరారు. మున్సిపల్ మార్కెట్, టౌన్‌గేట్‌ల వసూలు అంచనాలను తక్కువగా బడ్జెట్‌లో ప్రతిపాదించిన అధికారులపై ఆయన మండిపడ్డారు. రూ.280 కోట్ల భూగర్భ డ్రైనేజీ నిర్మాణం పనులు, రూ.96 కోట్ల అంచనాలతో నిర్మిస్తున్న ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణం, తిరుపతి నాయుడు కాలనీలో జరుగుతున్న పార్కు నిర్మాణం పనుల్లో జరుగుతున్న ఆలస్యంపై సభ్యులు మండిపడ్డారు. పనుల నిర్వహణలో అలసత్వం వహిస్తున్న సదరు కాంట్రాక్టర్లను పిలిపించాలంటూ గత సమావేశంలో చెప్పినప్పటికీ వారు నేడు మీటింగుకు ఎందుకు హాజరుకాలేదంటూ మున్సిపల్ చైర్మన్‌తో పాటు వైస్ చైర్మన్ ఫయా జుర్ రహిమాన్, సభ్యులు మదనమోహన్‌రెడ్డి, కొలిమి చాన్‌బాషా, హారూన్‌బాషా, అల్తాఫ్ తదితరులు అధికారులను ప్రశ్నించారు. త్వరలో నిర్వహించే సమావేశానికి వారు హాజరయ్యేలా చూస్తామంటూ కమిషనర్ వాసుబాబు చెప్పడంతో సభ్యులు శాంతించారు.

పారిశుద్ధ్య చర్యలకు ప్రాధాన్యత ఇవ్వండి

మున్సిపల్ పాతబస్టాండు స్థలం అన్యాక్రాంతం అవుతుండడం, ప్రైవేటు వ్యక్తులు స్థలానికి వ్యాపారుల వద్ద నుంచి బాడుగపేరుతో డబ్బులు వసూలు చేస్తుండడంపై సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. వీలైనంత త్వరగా స్థలాన్ని స్వాధీనం చేసుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలంటూ సభ్యులు డిమాండ్ చేశారు. మున్సిపల్ స్థలాలు ఎక్కడెక్కడ ఉన్నాయనే వివరాలను ప్రకటిస్తూ వాటి పరిరక్షణకు చర్యలు తీసుకోవాలంటూ మున్సిపల్ కమిషనర్‌ను చైర్మన్ ఆదేశించారు. పట్టణంలో మురుగునీటి కాలువలపై వెంటనే కల్వర్టులను నిర్మించాలని కోరారు. రంజాన్ పవిత్రమాసం ప్రారంభం కానున్నందున పట్టణంలో పారిశుద్ధ్య చర్యలు, తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలంటూ సభ్యులు జానం రాధ, విజయమ్మ, రౌనఖ్, కొలిమిచాన్ బాషా, గౌస్‌ఖాన్, అల్తాఫ్, హారూన్‌లు కోరారు. సమావేశంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకో కుండా పోలీసులు గట్టి భద్రతాచర్యలు చేపట్టారు.